"మధురమైన పిల్లలూ - ఏ మాత్రం పొరపాటు చేసినా కానీ మాయ ఎలా మింగేస్తుందంటే, ఇక వారు ఈశ్వరీయ సాంగత్యము నుండి కూడా దూరమైపోతారు, అందుకే తమను తాము సంభాళించుకోండి, జాగ్రత్తగా ఉండండి"

ప్రశ్న:- ఈ ఈశ్వరీయ క్లాసులో కూర్చునేందుకు నియమం ఏమిటి?

జవాబు:- ఎవరైతే తండ్రిని యథార్థంగా గుర్తించారో, వారే ఈ క్లాసులో కూర్చోగలరు. ఇక్కడ కూర్చునేవారికి అవ్యభిచారీ స్మృతి ఉండాలి. ఒకవేళ ఇక్కడ కూర్చుని ఇతరులను స్మృతి చేస్తూ ఉన్నట్లయితే వారు వాయుమండలాన్ని పాడు చేస్తారు. ఇది కూడా చాలా పెద్ద డిస్సర్వీస్. ఇక్కడి నియమాలు కఠినంగా ఉన్న కారణంగా మీ వృద్ధి తక్కువగా జరుగుతుంది.

ప్రశ్న:- ఏ ఒక్క విషయం ద్వారా పిల్లల అవస్థ గురించి తెలుస్తుంది?

జవాబు:- ఈ రోగీ, భోగీ ప్రపంచములో ఎప్పుడైనా, ఏదైనా పేపర్ వచ్చినప్పుడు ఏడ్వడం మొదలుపెడితే అప్పుడు వారి అవస్థ గురించి తెలుస్తుంది. ఏడ్వడము మీకు నిషిద్ధము.

గీతము:- ముఖాన్ని చూసుకో ప్రాణీ... (ముఖ్డా దేఖ్ లే ప్రాణీ...)

ఓం శాంతి. ప్రాణి అని లేక ఆత్మ అని ఎవరన్నారు, వీరి ప్రాణం పోయిందని అంటారు కదా. అనగా ఆత్మ వెళ్ళిపోయిందని కదా. కావున ప్రాణము అని ఆత్మను అంటారు, శరీరాన్ని కాదు. తండ్రి ఆత్మలను అడుగుతారు - నీవు పాపాత్మవా లేక పుణ్యాత్మవా? అందరూ తమను తాము పతితులమని ఒప్పుకుంటారు. కావున తండ్రి అంటారు - నేను ఏయే పాపాలు చేసాను, ఎప్పుడు చేసాను అని మీ ఆత్మను ప్రశ్నించుకోండి. అందరూ పాపాత్ములే కదా. కానీ నంబరువారుగానైతే ఉండనే ఉంటారు. మరి నంబరువారు పుణ్యాత్ములు ఎవరు? నంబరువన్ పాపాత్మ ఎవరు? భారత్ పావనముగా ఉండేది, ఇప్పుడు పతితముగా ఉంది. ఈ రోజు మనుష్యమాత్రులందరూ మాయకు బానిసలుగా అయ్యారు. అర్ధకల్పం మాయకు బానిసలుగా అవుతారు, ఆ తర్వాత మాయను బానిసగా చేస్తారు, అప్పుడు వారిని పుణ్యాత్ములు అని అంటారు. లక్ష్మీ-నారాయణులను భగవాన్, భగవతి అని అంటారు. వారిప్పుడు ఎక్కడికి వెళ్ళారు? సత్యయుగములో కేవలం లక్ష్మీ-నారాయణులు మాత్రమే కాదు, వారి పూర్తి వంశము ఉండేది. ఆ సమయంలోని భారత్ ను పావనము అని అనేవారు. అక్కడ దైవీ గుణాలు కల మనుష్యులు ఉండేవారు. సర్వగుణ సంపన్నులు, 16 కళల సంపూర్ణులు... అని అంటారు కావున పుణ్యాత్ములు అయినట్లు కదా! ఇంకా అహింసయే పరమధర్మంగా ఉండేదని కూడా అంటారు. కావున వారు అహింసకులుగా కూడా ఉండేవారు. హింసకు రెండు అర్థాలు ఉన్నాయి - హింస అనగా ఎవరినైనా హతమార్చడము, కొట్టడము. హత్య కూడా రెండు రకాలుగా ఉంటుంది. ఒకటేమో కామ ఖడ్గంతో హతమార్చడము, రెండవది ఎవరినైనా క్రోధముతో హతమార్చడము. ఇది కూడా హింసయే. ఈ సమయంలో అందరూ పాపాత్ములుగా ఉన్నారు. నిర్గుణుడినైన నాలో ఏ గుణము లేదు అని అంటారు కదా. కావున నంబరువారుగా ఉంటారు కదా. కానీ అందరూ పాపాత్ములుగా ఉన్నారు. ఎప్పుడైతే తండ్రి వస్తారో, అప్పుడు వారిని గుర్తించాలి. పరమపిత అని అంటారు, కావున వారికి తండ్రి ఎవరు లేరు, వారు అందరికీ తండ్రి, వారు అందరికీ టీచర్. పరమపిత పరంధామంలో ఉంటారు, వారికి తండ్రి ఎవరూ ఉండరు. మిగిలిన వారందరికీ తండ్రి ఉంటారు. బ్రహ్మ, విష్ణు, శంకరులకు కూడా తండ్రి ఉన్నారు. శివాయ నమః అని అంటారు కావున వారు తండ్రి అయినట్లే కదా. తండ్రి పునర్జన్మలలోకి రారు. కానీ వారు కల్పంలో ఒక్కసారి జన్మ తీసుకుంటారు. శివ జయంతి అని అంటారు, కనుక అది జన్మ అయినట్లు కదా. శివుడు ఎలా జన్మ తీసుకుంటారు అన్నది శాస్త్రవాదులకైతే తెలియదు. శివరాత్రి అని అంటారు, అది ఏ రాత్రి? రాత్రి వేళలో మనుష్యులు అంధకారానికి వశమై ఎదురుదెబ్బలు తింటారు. మరి భక్తి మార్గంలో కూడా గంగా స్నానాలు చేయండి, నాలుగు ధామాల యాత్ర చేయండి, ఇది చేయండి, అది చేయండి అని అంటారు. మరి ఇవన్నీ ఎదురుదెబ్బలే కదా. ఇది రాత్రి సమయము. సత్య, త్రేతాయుగాలు పగలు. సత్యయుగములో సుఖం ఉంటుంది. అక్కడ పరమాత్మను స్మృతి చేసే అవసరం ఉండదు. దుఃఖములో అందరూ స్మరిస్తారని అంటారు. అలా భక్తులు తండ్రిని స్మరిస్తారు, సాధన చేస్తారు, కావున వారు పతితంగా ఉన్నట్లు కదా. పతితము అని భారత్ నే అంటారు, ఎందుకంటే భారత్ యే పావనంగా ఉండేది. దేవీ-దేవతా ధర్మమున్నప్పుడు పవిత్ర ఆత్మలు ఉండేవారు. సత్యయుగములో వేరే ధర్మాలు ఉండవు. ఇతర ధర్మాలకు చెందిన పతిత ఆత్మలు ఎవరైతే ఉన్నారో, వారు శిక్షలు అనుభవించి పరంధామంలో ఉంటారు, సత్యయుగంలోకి రారు.

సత్యయుగంలో సుఖము, శాంతి, సంపద అన్నీ ఉండేవి. అక్కడ ఉండేదే ప్రారబ్ధము.

ఇక్కడ ఇప్పుడు పిల్లలైన మీది ఒకే మతము. అక్కడ ఒకే ఇంట్లో అనేక మతాలు ఉంటాయి. తండ్రి గణేశుడిని తలచుకుంటే, కొడుకు హనుమంతుడిని తలచుకుంటారు, కావున అనేక మతాలు ఉన్నట్లు కదా. ఇక్కడ తండ్రి నుండి పిల్లలకు వారసత్వం లభిస్తుంది. ఆ మాటకొస్తే ఇక్కడ ఎవరినైనా బాబా అని అనేస్తారు. గాంధీని కూడా బాపూ అని అనేవారు కదా - కానీ వారు అందరికీ తండ్రి కాదు. వీరు అనంతమైన తండ్రి. తండ్రి వచ్చి సంకెళ్ళ నుండి విడిపిస్తారు. భక్తి సంకెళ్ళు కూడా ఉన్నాయి. మేము పతితంగా ఉన్నాము అని వారేమైనా భావిస్తారా. పతితులను పావనంగా చేసేవారు ఒక్క తండ్రి మాత్రమే. మీరు ఒక్క సత్యమైన తండ్రిని నమ్ముతారు. ఇతర సత్సంగాలకు వెళ్తే, అక్కడ ఎవరూ రావద్దని అనరు. ఇక్కడైతే అస్సలు అనుమతి ఇవ్వరు. ఎప్పటివరకైతే తండ్రిని తెలుసుకోరో అప్పటివరకు క్లాసులో కూర్చోలేరు, ఎందుకంటే ఎప్పటివరకైతే స్మృతి ఉండదో అప్పటివరకు యోగ్యులు కారు. మాయ అయోగ్యులుగా చేస్తుంది. నిర్గుణుడినైన నాలో ఏ గుణము లేదు అని అంటారు. ఇలా అందరూ అంటారు, అనగా అందరూ పతితంగా ఉన్నారు. బ్రహ్మా, విష్ణు, శంకరులను కూడా నిందిస్తారు. వారి దృష్టి ఎలా ఉంటుందో, సృష్టి అలానే కనిపిస్తూ ఉంటుంది. ఒకవేళ ఎవరైనా ఇక్కడ కూర్చుని కూడా ఇతరులను స్మృతి చేస్తే, అది వ్యభిచారీ స్మృతి అయినట్లు కదా. స్మృతి పూర్తిగా నిలవదు ఎందుకంటే మాయ బుద్ధియోగాన్ని తెంచేస్తుంది. అయినా కూడా తండ్రి మీకు బుద్ధియోగాన్ని జోడించడం నేర్పిస్తారు. అంతిమంలో మీ స్మృతి నిలుస్తుంది. కావున అతీంద్రియ సుఖము గురించి అడగాలంటే గోప-గోపికలను అడగండి అన్న గాయనము అంతిమం కోసం ఉంది. ఈ సంస్థ ఎందుకు వృద్ధి చెందదు అంటే ఇక్కడి నియమాలు కఠినంగా ఉన్నాయి. ఎప్పటివరకైతే తండ్రిని తెలుసుకోరో అప్పటివరకు క్లాసులో కూర్చోలేరు ఎందుకంటే ఇక్కడ అవ్యభిచారీ స్మృతి కావాలి. ఇతరులెవ్వరూ సత్యఖండానికి యజమానులుగా తయారుచేయలేరు. మీరు సత్యఖండానికి యజమానులుగా తండ్రి ద్వారా అవుతారు. ఇప్పుడు ఇది అసత్యమైన ఖండము. అసత్యమైన శరీరము, అసత్యమైన మాయ... అని అంటారు కదా. అర్ధకల్పం ఇలాగే కొనసాగుతుంది. ఒకవేళ తండ్రి జ్ఞానంలోకి వచ్చారనుకోండి, అప్పుడు రచనను కూడా పావనముగా చేయాల్సి ఉంటుంది. ఒకవేళ పిల్లలు పవిత్రంగా అవ్వకపోతే వారు కుపుత్రులు అయినట్లు. ఇంట్లో ఒకవేళ ఒకరు పవిత్రంగా అయి ఇంకొకరు అవ్వకపోతే గొడవ జరుగుతుంది, అందుకే మనుష్యుల హృదయం విదీర్ణమైపోతుంది. ఇక్కడ వినేటప్పుడు బాగుంది, బాగుంది అని అంటారు, కానీ బయటకు వెళ్తే, మళ్ళీ మునుపటి వలె తయారవుతారు. గృహస్థ వ్యవహారంలో ఉంటూ పవిత్రంగా ఉండలేరని సన్యాసులు అంటారు, కావున మేమెలా ఉండగలము అని భావిస్తారు. కానీ ఇక్కడ ప్రతిజ్ఞ చేయవలసి ఉంటుంది. మేము పవిత్రముగా అవుతాము అని పిల్లలు కూడా అంటారు. సద్గతిదాత రండి, అని అర్ధకల్పం నుండి మనం పిలిచాము. కావున ఇప్పుడు వారొచ్చారు. మరి ఇప్పుడు వారి మాట వింటారా? లేక ఇంకెవరి మాటనైనా వింటారా! తండ్రి అంటారు - ఒకవేళ చెప్పింది వినకపోతే సత్యయుగములోకి ఎలా వెళ్ళగలరు. ఒకవేళ తండ్రికి పిల్లలుగా అవ్వకపోతే కుపుత్రులుగా అయినట్లు కదా, ఇక వారు నిలవలేరు. వారు ఉండడం కష్టమవుతుంది. హంస మరియు కొంగగా అవుతారు, ఇక ఎలా కలిసి ఉండగలరు. అచ్ఛా, ఎక్కడైనా స్త్రీ పవిత్రముగా అయి పతి పవిత్రముగా అవ్వకపోతే ఇక స్త్రీ తండ్రిని పిలుస్తుంది. తండ్రి అంటారు - పిల్లలూ, మీరు సహనం చేయవలసి ఉంటుంది. అచ్ఛా, వెళ్ళి పని చేసుకోండి, పాత్రలు శుభ్రం చేయండి, కేవలం రొట్టెముక్కే కదా కావాలి. వికారాలలోకి వెళ్ళడం కన్నా పాత్రలు శుభ్రం చేయడం మంచిది కదా. కూతురికి లౌకిక తండ్రి కూడా ఆశ్రయాన్ని ఇవ్వరు. నీ చేతికి అందుకే ఆ బంధనము కట్టాను, వికారాలలోకి వెళ్ళాల్సిందే అని అంటారు. కానీ పారలౌకిక తండ్రి అంటారు - దానమిస్తే గ్రహణం తొలగిపోతుంది. 5 వికారాల దానమిచ్చినట్లయితే గ్రహణం తొలగిపోతుంది. చంద్రుని వలె 16 కళల సంపూర్ణులుగా అవుతారు. శ్రీకృష్ణుడు 16 కళల సంపూర్ణుడు కదా. ఇప్పుడు ఏ కళలు లేవు. ఇప్పుడైతే అందరూ పతితులుగా ఉన్నారు. మేము పతితులుగా ఉన్నామని అంటారు కదా, అందుకే మీరు నరకవాసులు అని అంటే కోపగించుకుంటారు. ఈ సమయంలో యథా రాజా, తథా ప్రజా అందరూ పతితులుగా ఉన్నారు. సత్యయుగము శ్రేష్ఠాచారమైనది. సత్యయుగములో ఎవరూ ఏడ్వరు. కావున మీకు ఇక్కడ కూడా ఏడ్చేందుకు అనుమతి లేదు. ఏడుస్తున్నారంటే అవస్థలో లోపమున్నట్లు. తండ్రి 21 జన్మల రాజ్యాధికారాన్ని ఇస్తున్నారన్నప్పుడు, ఇక ఏడ్వాల్సిన అవసరమేముంది, కానీ ఇది మర్చిపోతారు. ఇది రోగీ ప్రపంచము, భోగీ ప్రపంచము. సత్యయుగము నిరోగి, యోగీ ప్రపంచము. ఇక్కడైతే తండ్రిని స్మృతి చేయాలి. స్మృతి చేయకపోతే డిస్సర్వీస్ చేస్తారు ఎందుకంటే వాయుమండలాన్ని పాడు చేస్తారు. ఇక్కడ అందరూ పతితులుగానే ఉన్నారు. కావున పతితులకు దానమివ్వడం ద్వారా పావనంగానైతే అవ్వలేరు. పతితులకు దానమిచ్చినట్లయితే వారు పతిత పనులే చేస్తారు. ఇక్కడ పతితులకు పతితులతోనే వ్యవహారముంది. అక్కడ పావనంగా ఉన్నవారికి పావనంగా ఉన్నవారితో వ్యవహారం ఉంటుంది. వ్యభిచారీ అన్న పదము చెడ్డది కదా. మొదట భక్తి కూడా అవ్యభిచారిగా ఉండేది.

శివుని పూజయే చేసేవారు. ఆ తర్వాత దేవతల భక్తిని మొదలుపెట్టారు. ఆ తర్వాత రజోగుణీ భక్తి అని అంటారు. ఇప్పుడైతే మనుష్యులను పూజించడం మొదలుపెట్టారు. సన్యాసుల చరణాలను కడిగి, ఆ నీటిని తాగుతారు. మనుష్యుల పూజను భూత పూజ అని అంటారు అనగా 5 తత్వాలతో తయారైన శరీరం యొక్క పూజ. వారేమీ అర్థం చేసుకోరు. కావుననే అంధుల పిల్లలు అంధులు అని అనడం జరుగుతుంది. నేత్రవంతుని పిల్లలైన మీరు నేత్రవంతులు. కావున వాళ్ళు అయితే చీకటిలో ఎదురుదెబ్బలు తింటూ ఉంటారు. గురు బ్రహ్మ, గురు విష్ణు, గురు శంకర... అని అంటారు. ఇలా అనడం కూడా తప్పే. విష్ణువు అయితే సత్యయుగంలో నివసించేవారు. వారు తమ ప్రారబ్ధాన్ని అనుభవిస్తారు. ఇకపోతే బ్రహ్మ గురువు, అది కూడా ఎప్పుడైతే ఈ తనువులోకి తండ్రి వస్తారో అప్పుడే. ఎప్పటివరకైతే తండ్రి రారో, అప్పటివరకు వీరు కూడా దేనికి ఉపయోగపడతారు.

అనంతమైన తండ్రి అంటారు - ఎవరైతే నా శ్రీమతంపై నడుస్తారో, వారే నా సుపుత్రులు. ఏ విధంగానైతే గవర్నమెంట్ ఆర్డినెన్స్ జారీ చేస్తుందో, అదే విధంగా ఈ పాండవ గవర్నమెంట్ కూడా ఏ ఆర్డినెన్స్ ను జారీ చేస్తుందంటే - పవిత్రంగా అయితే పవిత్ర ప్రపంచానికి యజమానులుగా అవుతారు అని. కావున దేహ సహితంగా దేహం యొక్క సర్వ సంబంధాలను మరచి నన్నొక్కరినే స్మృతి చేయండి అని తండ్రి అంటారు, ఈ శరీరంతో బుద్ధియోగం తెంచేలా చేస్తారు మరియు ఆత్మకు పరమాత్మతో నిశ్చితార్థం చేయిస్తారు. కావున తండ్రిని స్మృతి చేయాలి మరియు శరీరం పట్ల కూడా మమకారాన్ని తొలగించాలి. మోహజీతుని కథ ఒకటి ఉంది కదా, కావున మీరు కూడా మోహజీతులుగా అవ్వాలి. ఇది యుద్ధ మైదానము. ఈ యుద్ధములో ఏ మాత్రం పొరపాటు చేసినా కానీ మాయ మింగేస్తుంది. గజమును మొసలి పట్టుకుంది అని అంటారు. గజము అనగా ఏనుగు నీటిలోకి వెళ్ళడము, మొసలి దానిని పట్టుకోవడము అన్న విషయమేమీ లేదు. అలా కాదు, ఇది ఇక్కడి విషయము. మంచి-మంచి మహారథులు ఉన్నారు, వారు చాలా మందికి అర్థం చేయిస్తారు కూడా, సెంటర్లను కూడా సంభాళిస్తారు. ఒకవేళ వారు కూడా ఏ మాత్రం పొరపాటు చేసినా మాయ మింగేస్తుంది. ఎలా మింగేస్తుందంటే, ఇక అది తండ్రి సాంగత్యం నుండి దూరమయ్యేలా చేస్తుంది. పాత ప్రపంచంలోకి వెళ్ళిపోతారు. అందుకే చాలా జాగ్రత్తగా ఉండవలసి ఉంటుంది ఎందుకంటే ఇది మాయతో బాక్సింగ్ వంటిది మరియు ఇవి పూర్తిగా అర్థం చేసుకోవలసిన విషయాలు. కేవలం సత్యము-సత్యము అని అనవలసిన విషయాలు కావు. సత్యము-సత్యము అని భక్తి మార్గంలో అంటారు, ఫలానా వారు ముక్కు నుండి జన్మించారు, అవును సత్యము, హనుమంతుడు వాయువు నుండి జన్మించారు, అవును సత్యము అని అంటారు. అవన్నీ భక్తి మార్గపు విషయాలు. ఇక్కడ ఇవి జ్ఞానం యొక్క విషయాలు, వీటిని ధారణ చేయాలి. మాయతో యుద్ధం చేయాలి. ఒకవేళ తండ్రికి చెందినవారిగా అయి ఏదైనా పాపకర్మ చేసినట్లయితే ఇంకా వందరెట్ల శిక్ష పడుతుంది, కావున బాబా చాలా అప్రమత్తం చేస్తారు. చూడండి, ఇప్పుడు బాప్ దాదా సమ్ముఖంగా కూర్చుని చదివిస్తున్నారు. ఇప్పుడేమైనా ఓ భగవంతుడా అని అంటారా. శివబాబాకు ఒక్క బ్రహ్మయే పుత్రుడు, తర్వాత వారే బ్రహ్మ నుండి విష్ణువుగా అవుతారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన ఆత్మిక పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. చంద్రుని సమానంగా 16 కళల సంపన్నంగా అయ్యేందుకు 5 వికారాలను పూర్తిగా దానమిచ్చి గ్రహణం నుండి ముక్తులుగా అవ్వాలి.

2. తండ్రికి చెందినవారిగా అయి ఏ పాప కర్మలు చేయకూడదు. శరీరము పట్ల కూడా మమకారాన్ని తొలగించి మోహజీతులుగా అవ్వాలి.

వరదానము:- మీ శ్రేష్ఠ దృష్టి, వృత్తి ద్వారా సృష్టిని పరివర్తన చేసే విశ్వానికి ఆధార మూర్త భవ

పిల్లలైన మీరు విశ్వంలోని సర్వ ఆత్మలకు ఆధారమూర్తులు. మీ శ్రేష్ఠ వృత్తి ద్వారా విశ్వము యొక్క వాతావరణం పరివర్తన అవుతూ ఉంది, మీ పవిత్ర దృష్టి ద్వారా విశ్వములోని ఆత్మలు మరియు ప్రకృతి, ఈ రెండు పవిత్రంగా అవుతూ ఉన్నాయి. మీ దృష్టి ద్వారా సృష్టి మారుతూ ఉంది. మీ శ్రేష్ఠ కర్మల ద్వారా శ్రేష్ఠాచార ప్రపంచం తయారవుతూ ఉంది, ఇటువంటి బాధ్యతా కిరీటాన్ని ధరించే పిల్లలైన మీరే భవిష్యత్తులో కిరీటధారులుగా అవుతారు.

స్లోగన్:- అతీతముగా మరియు అధికారులుగా అయి కర్మలు చేసినట్లయితే ఏ బంధనము తన బంధనంలో బంధించలేదు.